www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 7 ఏప్రిల్ 2023



ఏలూరు జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా

కలెక్టర్‌కు పలువురి అభినందనలు

ఏలూరు:జిల్లాల విభజనలో నూతనంగా ఏర్పడిన ఏలూరు జిల్లా సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ని పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నేతలు కలిసి శాలువా కప్పి పూలమొక్కతో అభినందనలు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, ప్రముఖులు పి.శ్రీనివాస్, నోరి శ్రీనివాస్, మాదాసు సాంబశివరావు, కప్పల సత్యనారాయణ, కెవిఎస్.ఆర్.మోహన్, జి.రవికుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.నాగమణి, సునీత, సత్య భారతి తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సహాయ సహకారాలతో ఈ ఏడాది పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ ఎన్‌జిఒ సంఘం నాయకులకు తెలిపారు.

ధాన్యం కొనుగోలు

సాఫీగా సాగేనా..!

- సంచుల బాధ్యత మిల్లర్లకు అప్పగించడంపై ఆందోళన
- మిల్లుల కేటాయింపుపై ఇంకా స్పష్టత ఇవ్వని అధికారులు
- 15 నుంచి రబీ ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు
- లారీలు, సంచుల సమస్యపై రైతుల్లో వీడని ఆందోళన
- నిడమర్రు మండల ధాన్యం గణపవరం మిల్లులకు కేటాయిస్తేనే మేలు
- తేమ, తూకంలో మిల్లర్ల నిరంకుశ వైఖరికి అడ్డుకట్ట వేయాలని చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ ధాన్యం కొనుగోలు ఏ ఇబ్బందులూ లేకుండా సాఫీగా సాగేనా అంటూ రైతుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఖరీఫ్‌లో ధాన్యం విక్రయించేందుకు పడ్డ కష్టాలను గుర్తు చేసుకుంటూ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ 15 నుంచి రబీ ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాల శాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వరుస సమావేశాలు నిర్వహిస్తూ కిందిస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలులో అధికారులు తీసుకుంటున్న చర్యల వల్ల రైతులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. రబీలో రెండు జిల్లాల్లోనూ దాదాపు మూడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. సాగునీటి కష్టాలను దాటుకుంటూ పంట చివరి దశకు చేరుకుంది. వారం, పది రోజుల్లో రైతులు రబీ మాసూళ్లు ముమ్మరంగా ప్రారంభించనున్నారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు పడ్డ ఇబ్బందులను గుర్తుచేసుకుంటూ గుబులు చెందుతున్నారు. గడిచిన ఖరీఫ్‌లో మిల్లర్లు, సహకార సంఘాలతోపాటు వివిధ రకాలుగా రైతులకు సంచులు అందించే ప్రక్రియ నడిచింది. అయినప్పటికీ రైతులకు సక్రమంగా సంచులు అందించలేకపోయారు. దీంతో సంచుల కోసం రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రబీలో రైతులకు సంచులు అందించే పూర్తి బాధ్యతను మిల్లర్లకు అప్పగించినట్లు ప్రచారం సాగుతోంది. అదే జరిగితే సంచులు రైతులకు సక్రమంగా అందవని అనే భయం అందరినీ వెంటాడుతోంది. మిల్లర్లు ఎక్కువగా కమీషన్ వ్యాపారులతో సంబంధాలు పెట్టుకుంటారని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సంచులు సకాలంలో అందించేందుకు ఇష్టపడరనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. కమీషన్ వ్యాపారులను ధాన్యం కొనుగోలు చేసేవిధంగా ప్రోత్సహిస్తున్న పరిస్థితి ఉంది. అదే సమయంలో మద్దతు ధర దక్కేవిధంగా కూడా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్‌లో రైతులు ఎదుర్కొన్న ప్రధాన సమస్యల్లో లారీల సమస్య తీవ్రమైంది. రబీలో లారీల సమస్య లేకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో ఇప్పటి వరకూ సరైన స్పష్టత ఇవ్వలేదు. దీంతో లారీల పరిస్థితి ఏమిటనే భయం రైతులను వెంటాడుతోంది.

మిల్లర్ల నిరంకుశ వైఖరికి అడ్డుకట్ట పడేనా

ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలులో మిల్లర్లు నానా ఇబ్బందులకు రైతులను గురిచేశారు. దీంతో రబీలో ధాన్యం కొనుగోలుపైనా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తేమశాతం, తూకం పేరుతో రైతుల నుంచి డబ్బు వసూలు చేసిన పరిస్థితి ఖరీఫ్‌లో పెద్దఎత్తున సాగింది. రైతుభరోసా కేంద్ర అధికారులు తేమశాతం నిర్ధారించిన తర్వాత కూడా తేమ 17 శాతం కంటే ఎక్కువగా ఉందంటూ ధాన్యం రోజుల తరబడి దింపుకోకుండా ఇబ్బందులకు గురిచేసి, తేమ శాతానికి లెక్కలు కట్టి డబ్బు వసూలు చేయడం జరిగింది. తూకం విషయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవడంతోపాటు నానా ఇబ్బందులు పడ్డారు. తేమశాతం, తూకం నిర్ధారణ విషయంలో కచ్చితమైన చర్యలు తీసుకోవాలని, మిల్లర్ల నిరంకుశ వైఖరిని అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు. తేమ, తూకం నిర్ధారణ విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నారో ఇప్పటికీ సరైన స్పష్టత లేదు. రబీలోనూ ఈసమస్యలు పునరావృతమైతే తీవ్ర ఇబ్బందులు తప్పవని అన్నదాత తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

గణపవరంలో మిల్లులు కేటాయిస్తేనే మేలు

నిడమర్రు, గణపవరం మండలాలు రెండూ ఆనుకొని పక్కపక్కనే ఉంటాయి. గడచిన ఖరీఫ్‌లో గణపవరం మండలం ఏలూరు జిల్లాలోనే ఉంది. దీంతో నిడమర్రు మండలానికి సంబంధించిన రైతాంగం గణపవరంలోని మిల్లులకే తమ ధాన్యం విక్రయించారు. లారీలు దొరక్కపోతే పక్కనే మిల్లులు ఉండటంతో ట్రాక్టర్లతో తమ ధాన్యాన్ని తరలించారు. ఇప్పుడు గణపవరం మండలం పశ్చిమగోదావరి జిల్లాలోకి చేరింది. జిల్లా మారిందనే కారణంతో నిడమర్రు మండలంలోని రైతులకు గణపవరంలోని మిల్లులు కేటాయించకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడే పరిస్థితి రానుంది. ఇది రైతులపై పెనుభారం పడటంతోపాటు రవాణాపరంగా ఇబ్బందులు రానున్నాయి. జిల్లాల విభజనతో సంబంధం లేకుండా నిడమర్రు మండలంలోని ధాన్యానికి గణపవరంలో మిల్లులు కేటాయిస్తేనే ప్రయోజనం ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మిల్లుల కేటాయింపులపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో ఆ మండలంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

మా ఇంటికి మేమే సారథులం..!

- వైసిపి ప్రభుత్వంపై విపక్షాల విమర్శలు
- నేడు జిల్లాలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి శ్రీకారం
- అడ్డుకునే ఆలోచనలో టిడిపి, జనసేన



ఉండి నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి సిద్ధమైన గృహ సారధులు, వాలంటీర్ల కన్వీనర్లు

ప్రజాశక్తి - భీమవరం

కుటుంబ భారాన్ని, బాధ్యతలను మోస్తున్న నాన్నో.. అమ్మో.. అన్నో.. భర్తో.. లేక అక్కో మా గృహాలకు సారథులవుతారేగాని వేరే ఇంటికి చెందినవారు ఎలా సారథులవుతారని ప్రస్తుత ప్రభుత్వంపై అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్న వారు ప్రశ్నిస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న విపక్షాలు వైసిపి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నెల ఏడో తేదీ నుంచి జిల్లాలో వైసిపి 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. జిల్లావ్యాప్తంగా 14 రోజులపాటు 4,16,914 కుటుంబాలను వైసిపి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో గృహాలకు వచ్చేవారిని అడ్డుకునేందుకు టిడిపి, జనసేన సమాయత్తమవుతున్నాయి.

ప్రభుత్వం మరో కొత్త ప్రచార కార్యక్రమానికి తెరలేపింది. ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆ పార్టీ 'మా నమ్మకం నువ్వే జగన్' పేరిట స్టిక్కర్లు అతికించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా జిల్లాలో ఈ నెల ఏడో తేదీ నుంచి 20వ తేదీ వరకూ 'జగనన్నే మన భవిష్యత్తు' పేరిట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమైంది. జిల్లాలో భీమవరం, నరసాపురం డివిజన్లతోపాటు జిల్లాలో నూతనంగా కలిసిన గణపవరం మండలంతో కలుపుకుని 20 మండలాలున్నాయి. వాటి పరిధిలో 383 గ్రామ సచివాలయాల పరిధిలో 9,400 మంది వాలంటీర్లు పని చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 18.45 లక్షల జనాభా, సుమారు 4.70 లక్షల కుటుంబాలున్నాయి. సచివాలయానికి ముగ్గురు వైసిపి కన్వీనర్లు చొప్పున 1,152 మందితోపాటు ప్రతి 50 ఇళ్లకూ ఇద్దరు చొప్పున సుమారు వేలాది మంది గృహసారథులను వైసిపి నియమించింది. వాలంటీర్లతోపాటు ఇటీవల వైసిపి నియమించిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు భాగస్వాములు కానున్నారు. దీంట్లో భాగంగా సచివాలయాలవారీగా జిల్లావ్యాప్తంగా సారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో గురువారం సమావేశాలు నిర్వహించారు. సమర్థవంతంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్‌ఎలు, మంత్రులు దిశానిర్దేశం చేశారు. 14 రోజులపాటు జరిగే కార్యక్రమంలో ప్రతి ఇంటిని, కుటుంబాన్నీ సందర్శించనున్నారు. ఏడాదిలో ఎన్నికలున్నందున ప్రచార జోరు పెంచే వ్యూహంతో వైసిపి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అయితే వాలంటీర్లు మాత్రం క్షేత్రస్థాయిలోకి వెళ్లేందుకు సంకోచిస్తున్నారు. దీనికితోడు పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ తరుణంలో ప్రతి ఇంటికీ వెళ్లి స్టిక్కర్లు వేయడం సాధ్యమా అనే అనుమానంతో ఉన్నారు. అధికారులు మాత్రం తప్పనిసరిగా స్టిక్కర్లు వేయాలని, పథకాలు వర్తిస్తున్నప్పుడు కాదనకుండా నచ్చజెప్పే ప్రయత్నం చేయాలని ఆదేశించారు. అయితే ఇది ఎంతవరకూ ఆచరణ సాధ్యమో అర్థం కావడం లేదని వాలంటీర్లు వ్యాఖ్యానిస్తున్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కింద ఎంఎల్‌ఎలనే నిలదీసిన పరిస్థితులు గుర్తు చేసుకుంటున్నారు. మాస్థాయిలో ఇంటికెళ్తే ఎదురయ్యే పరిస్థితులను ఎలా అధిగమించగలమని వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఆందోళన పడుతున్నారు.

ఇంటింటి ప్రచారం ఇలా..

ఇద్దరు గృహసారథులు గ్రామ, వార్డు వాలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లాలంటూ పార్టీ ఆదేశాలు జారీ చేసింది. 'మిమ్మల్ని మీరు వైసిపి ప్రతినిధులుగా పరిచయం చేసుకోవాలని సూచించింది'. లబ్ధిదారుల ఇళ్లకు వాలంటీర్లు ప్రభుత్వ ఆసరా లేఖను అందించాలని ఆదేశించారు. గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ముందుగా గత, ప్రస్తుత పాలనను పోల్చే కరపత్రాన్ని చదివి వివరించడంతోపాటు వారికి కరపత్రాన్ని అందించాలని సూచించారు. ప్రజామద్దతు పుస్తకంలోని ప్రశ్నలను చదివి, వారి సమాధానాలను స్లిప్లోటిక్ చేయించమంటున్నారు. ఇంటి వారి పేరు, వారి ఫోన్ నంబరు స్లిప్ మీద రాయమంటున్నారు. ప్రశ్నలకు ఇంటి యజమాని సమాధానం అవును అయితే స్లిప్‌లోని కుడి భాగాన్ని చింపి వారికి ఇవ్వాలని సూచించారు. 82960 82960 నంబరుకు మిస్డ్‌కాల్ ఇచ్చి జగనన్నకు మద్దతు తెలపమని కోరాలని పేర్కొన్నారు. ఇంటివారి అనుమతితో వారి ఫోన్ వెనుక మొబైల్ స్టిక్కర్, తలుపు బయట డోర్ స్టిక్కర్ అంటించాలని ఆదేశించారు. వాటిని ఫొటో తీసి మీ జెసిఎస్ మండల వాట్సాప్ గ్రూపునకు పంపాలని కోరారు. ఇవన్నీ ఎలా అమలు చేయగలమని వాలంటీర్లతోపాటు గృహ సారథులు మదనపడుతున్నారు.

కిట్లు పంపిణీ

మండలాలవారీగా ఇప్పటికే కిట్లను గృహ సారథులకు, వాలంటీర్లకు, సచివాలయ కన్వీనర్లకు అందజేశారు. ఇప్పటికే వీరికి శిక్షణ కూడా అందించారు. ప్రతి కిట్‌లో 200 ఇళ్లకు సరిపడా ప్రచార సామగ్రిని ఉంచారు. గృహ సారథులు ధరించేందుకు ఐదు బ్యాడ్జీలు, స్లిప్‌లు నింపేందుకు ఐదు పెన్నులు, గత, ప్రస్తుత ప్రభుత్వాలను పోల్చే కరపత్రాలు 200, ఫోనుకు అతికించేందుకు 200 మొబైల్ స్టిక్కర్లు, జగనన్న ప్రభుత్వంపై ప్రజామద్దతు సేకరించేందుకు 75 స్లిప్‌లు గల నాలుగు పుస్తకాలు, తలుపులపై అంటించేందుకు డోర్ స్టిక్కర్లు 200, ప్రచార సామగ్రిని పంచేందుకు మూడు అదనపు బ్యాగ్‌లు పంపిణీ చేశారు.

ప్రభుత్వంపై విమర్శలు

జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగనన్న నినాదంతో వైసిపి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల విధుల నుంచి వాలంటీర్లను దూరం పెట్టాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో వైసిపి గృహసారథులను, కన్వీనర్లను ఏర్పాటు చేసిందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికలు రానున్న నేపథ్యంలో వాలంటీర్లతో గృహసారథులు కన్వీనర్లను ఇప్పటి నుంచి మమేకం చేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన పార్టీలు ఈ కార్యక్రమం నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదిలాఉంటే ముఖ్యమంత్రి జగన్‌కు అనుకూలంగా లేకపోతే పథకాలు ఆపివేస్తారనే ప్రచారం జరుగుతోందని, ప్రతి గ్రామంలోని ప్రజలు, ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ విధానాన్ని అడ్డుకుని ఒక వీడియో తీసి అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రసారమాధ్యమంలో టిడిపి విస్తృత ప్రచారం చేసింది. ఈసారి టిడిపి, జనసేన ఈ కార్యక్రమాన్ని అడ్డుకునే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది.

'మిషన్ వాత్సల్య'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

తల్లిదండ్రులు లేని 18 ఏళ్లలోపు వారికి ఆర్థిక అవసరాలు తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రాయోజిత పథకం మిషన్ వాత్సల్య స్కాలర్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎపి బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యులు డాక్టర్ జంగం రాజేంద్రప్రసాద్ సూచించారు. స్కాలర్‌షిప్ ద్వారా పిల్లలకు నెలకు రూ.నాలుగు వేలు అందిస్తారన్నారు. ఈ పథకం కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని, ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లల వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలు అర్హులని తెలిపారు. వితంతువు, విడాకులు తీసుకున్నా, లేక కుటుంబం వదిలివేసిన తల్లికి కలిగిన పిల్లలు, అనాధ, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న అనాధ బాలలు అర్హులన్నారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, ఆర్థికంగా, శారీరకంగా పిల్లలను పెంచలేని నిస్సహాయ తల్లిదండ్రుల పిల్లలు, బాల న్యాయ (రక్షణ, ఆదరణ) చట్టం -2015 ప్రకారం రక్షణ పొందొచ్చన్నారు. సంరక్షణ అవసరమైన పిల్లలు- ఇల్లు లేని బాలలు, ప్రకృతి వైపరీత్యాలకు గురైన బాలలు, బాల కార్మికులు, బాల్య వివాహ బాధిత బాలలు, హెచ్‌ఐవి, ఎయిడ్స్ బాధిత బాలలు, అక్రమ రవాణాకు గురైన బాలలు, అంగవైకల్యం ఉన్న బాలలు, తప్పిపోయిన, పారిపోయిన బాలలు, వీధి బాలలు, బాల యాచకులు, హింసకు, వేధింపులకు, దుర్వినియోగం, దోపిడీలకు గురైన బాలలు, సహాయం, ఆశ్రయం కావాల్సిన బాలలు పిఎం కేర్ ఫర్ చిల్డ్రన్స్ మంజూరైన బాలలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రెసిడెన్సియల్ స్కూల్లో చదువుతున్న బాలలకు ఈ పథకం వర్తించదని ఆయన తెలిపారు. ఈ పథకానికి అర్హులైన పిల్లలకు గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంస్థ ఆదాయం రూ.72 వేలకు అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో కుటుంబ సంస్థ ఆదాయం రూ.96 వేలకు మించి ఉండరాదన్నారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు కేంద్రం 60 శాతం అంటే రూ.2400 కాగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రూ.1600 నిధులు సమకూర్చి అనాధ పిల్లలకు అందజేస్తారని తెలిపారు.



ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో నాయకులు

'టిడిపి విజయం ఖాయం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బందంచర్లలో గురువారం టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా నాయకులు ఇంటింటా తిరిగి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని తరగతుల ప్రజలు సిఎం జగన్ పాలనపై అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. ప్రజాసమస్యలు పరిష్కరించడంలో జగన్ ఘోరంగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి, నాయుడు రామకృష్ణారావు గౌడ్, పిన్నమనేని మధు, కొండపల్లి రవి, ఆచంట సూర్యనారాయణ, బొంతు సత్యనారాయణ, భీమవరపు జగన్మోహన్‌రావు, జోనుబోయిన సోంబాబు, ఘంటా సతీష్, పెద్దిన సత్యనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు డిగ్రీ కళాశాలకు శాశ్వతమైన భవనాలు ఏర్పాటు చేయాలని అఖిల పక్ష రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. కాలేజీ విద్యార్థులు 'ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవనాల సాధన సమితి'గా ఏర్పాటయ్యారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఏలూరు మర్చంట్ ఛాంబర్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఏలూరులో 2008లో ప్రారంభించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేకపోవడం సరికాదన్నారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు మంజూరైన ఏడు కాలేజీలకు భవనాలు ఏర్పాటుకాగా జిల్లా కేంద్రం ఏలూరులో కాలేజీకి నేటికీ సక్రమమైన వసతులతో కూడిన భవనాలు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. వైసిపి నగర అధ్యక్షులు బొద్దాని శ్రీను మాట్లాడుతూ ఎంఎల్‌ఎ ఆళ్ల నానితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసి నేత యు.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నేత ఆర్.రామ్మోహనరావు, టిడిపి నేత చోడే వెంకటరత్నం మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి తోడ్పడతామమని, విద్యార్థులకు భవిష్యత్ కార్యాచరణపై సూచనలు, సలహాలు ఇచ్చారు. దానితోపాటుగా అఖిలపక్ష విద్యార్థి సంఘాలు పిడిఎస్‌యు, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, వైఎస్‌ఆర్‌ఎస్‌ఎఫ్, న్యాయవాద, దళిత సంఘాలు, హేలపూరి బాలోత్సవ సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భావనాల సాధనకు వారి సలహాలు, సూచనలు విద్యార్థులకు అందించారు. ఈ సమావేశానికి కాలేజీ విద్యార్థి పి.దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు.

ప్రశాంతంగా హిందీ పరీక్ష

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రెండో రోజు గురువారం పదో తరగతి హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 22,796 మంది విద్యార్థులకు గాను 22,470 మంది హాజరయ్యారు. 326 మంది గైర్హాజరయ్యారు. 98.57 శాతం మంది హాజరయ్యారు. 120 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ 51 కేంద్రాలను, కలెక్టర్ ఒక కేంద్రం, జెసి ఒక కేంద్రం, జిల్లాస్థాయి అబ్జర్వర్ ఐదు పరీక్షా కేంద్రాలు, జిల్లా విద్యాశాఖాధికారి ఐదు కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు : పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్ద వేసవి దృష్ట్యా సురక్షిత తాగునీరును ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారును ఆదేశించారు. గురువారం స్థానిక కస్తూరిభా నగరపాలక బాలిక ఉన్నత పాఠశాలలో జరుతుగున్న పదోతరగతి పరీక్షల నిర్వహణను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సెంటర్లను పటిష్టమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు తనిఖీలు చేయాలని ఆదేశించారు. కస్తూరిభా బాలికోన్నతపాఠశాలలో విద్యార్థులు తాగడానికి ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి క్యానను కలెక్టర్ ఓపెన్ చేసి వాటర్ తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విధంగా అన్ని పరీక్షా కేంద్రాల్లో సురక్షిత తాగునీటిని విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని ఆదేశాలిచ్చారు. ఈ పర్యటనలో కలెక్టర్‌వెంట పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ఇంటింటి సర్వే

ఏలూరు:జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఏలూరు పరిధిలోని ఆశా వర్కర్లకు ప్రజా ప్రయోజన సేవల శాశ్వత న్యాయ పీఠం ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మనోరమ మాట్లాడుతూ ప్రతీఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిరక్షణపై సర్వే నిర్వహిస్తామని, వ్యాధులను గుర్తించి ఆశా వర్కర్ ద్వారా తక్షణం చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే గర్భస్థ శిశువు నుండి ప్రసవం అయ్యేవరకూ ఆయా పరిస్థితులను బట్టి వైద్యం, ఆహార సదుపాయం, ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. ఆశా వర్కర్లు తమ విధులను నిబద్ధతతో నిర్వహిస్తున్నారని అదే స్ఫూర్తితో ప్రజలకు వైద్య సేవలందించాలని, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఎవరైనా తమకు కనపడితే ఆరోగ్య కేంద్రాలకుగానీ, జిల్లా ఆసుపత్రుల నిర్వహణ డాక్టర్లకు గానీ తెలియజేసి తక్షణం చికిత్స అందజేయాలని ఆశా వర్కర్లకు సూచించారు. గ్రామాల్లో గర్భస్థ నిర్ధారణ పరీక్షలపై అవగాహన కలిగించి అలాంటి చర్యలకు పాల్పడకుండా చూడాలని తెలిపారు. మేరీగ్రేస్ కుమారి మాట్లాడుతూ ఆశా వర్కర్లు ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రత, పోషకాహారంపైన అవగాహన కల్పించాలని, అలాగే ఆరోగ్య సేవలపై ఏమైనా సమస్యలుంటే ప్రజాప్రయోజన సేవల శాశ్వత న్యాయ పీఠాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కూన కృష్ణారావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్య సేవలు

'ఫ్యామిలీ డాక్టర్', 104 సేవల ప్రారంభోత్సవంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేరువలో ఆధునిక వైద్యసేవలను ఉచితంగా అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. సిఎం జగన్ పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుట్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా ఏలూరు పట్టణంలోని శనివారపుపేటలోని వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ వద్ద గురువారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను, 104 వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందరికీ మంచి ఆధునిక వైద్యం అందించేందుకు గ్రామంలోనే వైద్యసేవలు అందించే ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రతీ మండలానికి రెండు పిహెచ్‌సిలు, ఇద్దరు వైద్యులు ఒక 104 వాహనంతో అనుసంధానం చేసి ప్రతీరోజు వారికి కేటాయించిన గ్రామాల్లోని వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి వైద్య సేవలందిస్తారని తెలిపారు. వారికి కేటాయించిన గ్రామాల్లో నెలలలో కనీసం రెండుసార్లు సందర్శించి ప్రజలకు వైద్య సేవలందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి 44 మొబైల్ మెడికల్ యూనిట్లను (104 సేవలు) వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌తో అనుసంధానం చేయడం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లోని సిహెచ్‌ఒ, ఎఎన్ఎంలు ఆశా వర్కర్ల సహకారంతో వైద్య సేవలందిస్తారన్నారు. ప్రతి డాక్టర్ హెల్త్ క్లినిక్‌లో 16 రకాల టెస్టులు 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. తొలుత హెల్త్‌క్లినిక్‌లో ఉంచిన మందులు, పేషంట్ రూములు, వైద్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ పరిశీలించారు.

అనంతరం 104 సేవల వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. వాహనంలో అమర్చిన వైద్యపరికరాలను పరిశీలించి స్వయంగా డాక్టర్లతో బిపి పరీక్ష చేయించుకున్నారు. 104 వాహనం ద్వారా స్థానిక విఎంపి.కాంతమ్మ(83) ఇంటికి వెళ్లి వైద్యసేవలందించారు. ఆమె అనారోగ్య పరిస్థితులపై కలెక్టర్ ఆరా తీశారు. డాక్టర్లతో ఆమెకు పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమానికి ముందు సిఎం జగన్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించి ప్రసంగిస్తున్న దృశ్యాలను టీవీ ద్వారా ప్రజలు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపి మెడికల్ బోర్డు కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిరిసాల ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆశ, డిఐఒ నాగేశ్వర రావు, డాక్టర్లు మంజూష, జోషి రాయ్, పూర్ణచంద్ర, 104 వాహన జిల్లా కోఆర్డినేటర్ గణేష్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, 104 వాహన సిబ్బంది, సిహెచ్‌ఒలు, ఆశాలు, ఎఎన్ఎంలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు నియోజకవర్గపరిధిలో ఈ నెల ఏడో తేదీ నుంచి సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులతో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. నూజివీడు పట్టణంలోని ద్వారకా ఎస్టేట్స్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు గృహ సారధులు ఇంటింటికీ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రతీఇంటికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులతో కనీసం పది నుండి 15 నిమిషాలు కేటాయించి, ఆ కుటుంబ యోగక్షేమాలను తెలుసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతీ సభ్యునికి తెలియజేయాలని సూచించారు. ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అన్ని ఇంటి తలుపులను తట్టి సంక్షేమ కార్యక్రమాలు వివరించడంతో పాటుగా, సహేతుకమైన ఆధారాలు అందించామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి రాష్ట్రంలో శరవేగంగా సాగుతోందన్నారు. అన్నితరగతుల ప్రజల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా జగన్ పాలన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పేదవర్గాల్లోని ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం నవరత్నాలు వంటి బృహత్తరమైన పథకాన్ని అందుబాటులోకి తెచ్చి, కుల, మత, వర్గ రాజకీయ విభేదాలకు తావులేకుండా పేదరికమే అర్హతగా అందరికీ సంక్షేమ నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తున్నట్లు తెలిపారు.

రత్నకిషోర్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సిపిఎం సీనియర్ కార్యకర్త ఎం.రత్నకిషోర్ (75) ఆయన స్వగ్రామమైన గుంటూరు జిల్లా తెనాలి దగ్గర గుడివాడ గ్రామంలో బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కేంద్రం శాఖ కార్యదర్శి పి.ఆదిశేషు సంతాపం తెలిపారు. రత్నకిషోర్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రత్నకిషోర్ చాలాకాలం సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో క్లర్కుగా పనిచేశారన్నారు. వారి స్వగ్రామంలో ప్రజాతంత్ర ఉద్యమాన్ని బలోపేతం చేయడం కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ప్రజాశక్తి పత్రికను తానే స్వయంగా చందాదారులకు అందించేవారన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల పూర్తి కాలం కార్యకర్తగా రావాల్సిన రత్న కిషోర్ ఉపాధి కోసం సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారని తెలిపారు.



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

10.85 హెక్టార్లలో మొక్కజొన్నకు నష్టం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఇటీవల గాలి వర్షానికి ఉంగుటూరు మండలంలో మెట్ట ప్రాంతంలో దెబ్బతిన్న మొక్కజొన్న పొలాల్లో పంట నష్టం అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు గురువారం పలు గ్రామాలను సందర్శించారు. గొల్లగూడెం తదితర గ్రామాల్లో 10.85 హెక్టార్లో మొక్కజొన్న పంట దెబ్బతిందని డిఆర్‌సి ఎడిఎ పి.లలిత సుధ అన్నారు. పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపించి పరిహారం అందేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ఎఒ వెంకటేష్ పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'పై అవగాహన

ప్రజాశక్తి - కైకలూరు

ఈ నెల ఏడో తేదీ నుంచి 20వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని జెసిఎస్ కన్వీనర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు అత్యంత పకడ్బందీగా, ప్రజారంజకంగా నిర్వహించి పార్టీ పటిష్టతకు పాటు పడాలని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వైసిపి కార్యాలయంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, మండల జెసిఎస్ కన్వీనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. తొలుత కార్యక్రమం విధివిధానాలు, చేపట్టాల్సిన చర్యలు, ఆచరణాత్మక ప్రణాళికలను దృశ్య శ్రవణ విధానం ద్వారా వివరించారు. అనంతరం కార్యక్రమం చేపట్టి పూర్తి చేయాల్సిన విధానాన్ని ఎంఎల్‌ఎ వివరించి కార్యక్రమ కిట్స్, కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కైకలూరు మండల జెసిఎస్ కన్వీనర్ అడవి వెంకటకృష్ణమోహన్, ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, మండవల్లి మండల జెసిఎస్ కన్వీనర్ పెద్దిరెడ్డి రామదుర్గాప్రసాద్, వివిధ గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు, మండల జెసి కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎంపిపి కోర్స పోసమ్మ అన్నారు. జీలుగుమిల్లిలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా ఈ పోస్టర్లను ఆవిష్కరించినట్లు తెలిపారు. ప్రతి సచివాలయం గృహ సారథులు, కన్వీనర్లు ఈ పోస్టర్లను మొబైల్ స్టిక్కర్లను ప్రతి ఇంటికి వెళ్లేలా కృషి చేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, సర్పంచులు జగదాంబ, సున్నం వరలక్ష్మి, సచివాలయం కన్వీనర్ వనమా రామకృష్ణ, ప్రేమ్‌కుమార్, టౌన్ కార్యదర్శి చక్రి, రాము పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు



ఫ్యాక్టరీ నుంచి ఎగసిపడుతున్న మంటలు

టైల్స్ పరిశ్రమ ఆవరణలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం టైల్స్ ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం రాత్రి స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. పరిశ్రమ ఆవరణలో ఓ మూల గోనెసంచులు, చెత్త చెదారం, జీడి పిక్కల వ్యర్థాలు తదితర వస్తువులు అగ్ని ప్రమాదానికి గురై మంటలు ఎగసిపడ్డాయి. వెంటనే ఫ్యాక్టరీ అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేశారు. తొలుత మంటలను చూసిన చేబ్రోలు, నారాయణపురం ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే మంటలు అదుపు చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలోని బొద్దనపల్లి మామిడితోటలో జరిగిన హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నూజివీడు డిఎస్‌పి ఎ.అశోక్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మైలవరానికి చెందిన నాగమణి నాలుగేళ్ల క్రితం భర్తతో విడిపోయి ఆగిరిపల్లి మండలం సీతారామపురానికి చెందిన పాలకుర్తి గోపితో సహజీవనం చేస్తుంది. ఈ క్రమంలో బొద్దనపల్లికి చెందిన కోటేశ్వరరావుతో నాగమణి వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. వీరిద్దరి మధ్య గొడవలు రావడంతో నాగమణి తిరిగి గోపి దగ్గరికి వెళ్లిపోవాలనుకుంది. ఇందుకు కోటేశ్వరరావు ఒప్పుకోకపోవడంతో గోపి, నాగమణి పథకం ప్రకారం ఐదో తేదీ అర్ధరాత్రి మామిడితోటలో పాకలో నిద్రిస్తున్న కోటేశ్వరరావుపై గొడ్డలితో దాడి చేశారు. దీంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి పర్యవేక్షణలో రూరల్ సిఐ ఆర్.అంకబాబు ఆధ్వర్యంలో ఆగిరిపల్లి ఎస్ఐ చంటిబాబు తన సిబ్బందితో కలిసి నూజివీడు మండలం చెక్‌పోస్ట్ వద్ద నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో సిఐ ఆర్.అంకబాబు, రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్ఐ చంటిబాబు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అందక వృద్ధుల ఇక్కట్లు

పడని వేలిముద్రలు - పట్టించుకోని అధికారులు



వృద్ధుడు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మిషన్‌లో వృద్ధుల వేలిముద్రలు పడకపోవడంతో నెలల తరబడి వృద్ధుల కుటుంబాలకు రేషన్ బియ్యం ఇవ్వకపోవడంతో వారు పడరాని పాట్లు పడుతున్నారు. తమకు రేషన్ బియ్యం ఇవ్వాలంటూ అధికారులు, గ్రామ సచివాలయాలు చుట్టు తిరుగుతున్నారు. ముదినేపల్లికి చెందిన నిరుపేద అయిన అలసందలపల్లి నాగేశ్వరరావు (నాగులు)కు గతంలో అధికారులు అంత్యోదయ కార్డు (35కేజీల కార్డు) మంజూరు చేశారు. దీంతో ప్రతినెల 35 కేజీల రేషన్ బియ్యం డీలర్‌వద్ద నుంచి నాగేశ్వరరావు తీసుకుంటున్నాడు. గత మూడు నెలలుగా వృద్ధ దంపతుల ఇద్దరి వేలిముద్రలు పడక పోవడంతో రేషన్ బియ్యం ఇవ్వడం ఆపేశారు. దీంతో వృద్ధ దంపతులకు బియ్యం ఇవ్వక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వృద్ధుడు నాగేశ్వరరావు తనకు బియ్యం ఇవ్వలేదంటూ గ్రామ సచివాలయం, గ్రామ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదంటూ వృద్ధుడు ఆవేదన చెందుతున్నాడు. మండలంలోని వణుదురుకు చెందిన వృద్ధురాలు చిన్నం రాహేలమ్మ రెండు నెలలుగా బియ్యం ఇవ్వడంలేదు. అడిగితే వేలిముద్రలు పడడం లేదని చెబుతున్నారు. ఈ రీతిగా మండలంలోని అనేక గ్రామాల్లో వృద్ధుల వేలిముద్రలు పడడంలేదంటూ రేషన్ ఇవ్వకపోవడంతో వృద్ధులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వృద్ధుల వేలిముద్రలు పడని పక్షంలో గ్రామ వాలంటీర్ల ద్వారా రేషన్ ఇవ్వాల్సి ఉంది. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వృద్ధులు ఆకలి బాధలతో అలమటిస్తున్నారు. ఈ విషయంపై ముదినేపల్లి గ్రామ విఆర్ఒ కరీంను వివరణ కోరగా తన దృష్టికి రాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వేలిముద్రలు పడని వృద్ధులకు బియ్యం ఇచ్చేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

పేదల ఇంటి వద్దకే మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - కైకలూరు

పేదల ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రత్యక్ష నిదర్శనమని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని భుజబలపట్నంలో ఫ్యామిలీడాక్టర్ కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. నూతన 104 వాహనాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వైద్యాన్ని ఇంటిటికి అందుబాటులోకి తెచ్చి రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకటకృష్ణమోహన్, గ్రామ సర్పంచి గురజాల రామతులసి, వైసిపి మండల అధ్యక్షులు బత్రాజు శివాజీ, వైద్యులు కిరణ్, పంచాయతీ కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ, హెల్త్ విజిటర్ నాగమణి, కరణమ్మ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భీమడోలు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, భీమడోలు మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీత మాన్సింగ్ కోరారు. మండల స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని భీమడోలులోని మూడో నెంబర్ గ్రామ సచివాలయం వద్ద గురువారం ప్రారంభించారు. గుండుగొలను పిహెచ్‌సి వైద్యులు ప్రసాద్ వైద్య సేవలందించారు. ఆరోగ్య సిబ్బంది రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి, జెడ్‌పిటిసి సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగులకు వారి నివాస ప్రాంతాల వద్ద వైద్య సేవలు అందుతాయన్నారు. కదలని స్థితిలో ఉన్న రోగుల ఇళ్లకు వైద్యులు నేరుగా వెళ్లి వైద్య సేవలందిస్తారన్నారు. ఆరోగ్యశ్రీకి సంబంధించిన చికిత్స పొందిన వారికి వైద్యం అనంతరం అందించే సేవలు అందుబాటులో వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సొసైటీ అధ్యక్షులు రాయపాటి సత్యశ్రీనివాస్, వైసిపి ప్రముఖులు డాక్టర్ పి.మాన్సింగ్, తుమ్మకుంట రంగా, రామకుర్తి నాగేశ్వరరావు, భీమడోలు ఎంపిటిసి సభ్యులు ముళ్లగిరి జాన్సన్ పాల్గొన్నారు.

పోలవరం : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మండలంలోని గూటాలలో ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు గురువారం ప్రారంభించారు. వైఎస్ఆర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ కేంద్రంగా వైద్య సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీలో అనేక జబ్బులను చేర్చి పేదలకు వైద్య చికిత్సలు అందిస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో నెలకు రెండు సార్లు మెడికల్ ఆఫీసర్ ఆయా వెల్‌నెస్ సెంటర్ పరిధిలోని స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలకు పరీక్షలు చేయడంతోపాటు రోగుల ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేసి మెరుగైన వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు. నెలలో రెండుసార్లు మాత్రం 104 వాహనంతో పాటు మెడికల్ ఆఫీసర్ వెళ్లి వైద్య సేవలు అందించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ, సర్పంచి ఎస్.ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు డి.హరిరామకృష్ణ, జంగారెడ్డిగూడెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజీవ్, ఎల్అండ్‌డి పేట పిహెచ్ సి వైద్యాధికారి ఆర్.సునంద పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని గోపవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కంచర్ల వాణి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బసవరాజు సత్యనారాయణ, మండల శాఖ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎం.కిరణ్‌కుమార్, వైసిపి నాయకులు కోటగిరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ప్రతి ఇంటికి వైద్య సేవలను చేరువ చేయాలనే సదుద్దేశంతోనే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండల పరిధిలోని చిన్నాగిరిపల్లి గ్రామ సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని, నూతన 104 వాహనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.అనూష, జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, గ్రామసర్పంచి పి.రమాదేవి, తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు, ఎంపిడిఒ కె.వాణి, ఆగిరిపల్లి, ఈదర వైద్యాధికారులు జె.జగన్మోహనరావు, ఎస్‌కె.టినా, నరేంద్రకృష్ణ, వైసిపి నాయకులు పి.నరసింహారావు, జి.ఇస్సాక్, పి.జమదగ్ని, ఎం.రవిశేఖర్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : గ్రామాల్లో ప్రతిఒక్కరూ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వైవాకలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి వైద్యం అందుబాటులో ఉండాలని ప్రతి మారుమూల గ్రామానికి కూడా వైద్యం అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మధుమేహం, రక్తపోటు, ఇతర జబ్బులున్న రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మొట్రు ఏసుబాబు, గ్రామ సర్పంచి నున్న పద్మావతి, వైసిపి నేతలు ఈడే వెంకటేశ్వరరావు, నున్న కనకరాజు, బందెల ప్రభాకర్, ప్రవీణ్, కె.సమూయేలు, సాధు, బాలసుందరం, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కామవరపుకోట

కేన్సర్‌తో బాధపడుతున్న టిడిపి కార్యకర్తకు టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఆకుమర్తి రామారావు రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వచ్చిన మండలంలోని కొండగూడెం(నాయకులపేట)కు చెందిన నల్లమోతుల నాగ మల్లేశ్వరరావును రామారావు గురువారం పరామర్శించారు. నాగమల్లేశ్వరరావు కుటుంబానికి 25 కేజీల బియ్యం, రూ.పది వేల నగదు అందించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ టిడిపి మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ ద్వారా విషయం తెలుసుకుని సహాయం అందించినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా తీవ్ర అస్వస్థతకు గురైన వారుంటే సమాచారం తెలిపితే తన వంతు సహకారం అందిస్తానని రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఘంటా సుధీర్‌బాబు, గోధుం మధు, నన్నా హరిచంద్ర, మల్లెల్లి కాంతారావు, బిరుదుగడ్డ రవి, మల్లెల్లి నాగరాజు, గోధుం రాధాకృష్ణ, వనపర్ల ప్రేమ్‌కుమార్, కుమార్, బొబ్బిలి డాన్ దివాకర్ పాల్గొన్నారు.

మండవల్లిలో పరీక్షా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - మండవల్లి



పరీక్షా కేంద్రం వద్ద శ్రీకాంత్, సిబ్బంది

2022-2023 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలను కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి హిందీ పరీక్షలను గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా గాలి వెలుతురు వచ్చే గదులను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతేడాది పదో తరగతి పరీక్షలో చోటు చేసుకున్న మాస్ కాపీయింగ్ దృష్ట్యా ఈ ఏడాది పరీక్షల్లో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. సమస్యాత్మకమైన పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఆయనతో పాటు తహశీల్దార్ సతీష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'పది' పరీక్షలకు 878 మంది హాజరు

కలిదిండి : పదో తరగతి ద్వితీయ భాష హిందీ పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ కొల్లాటి నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 166కు ముగ్గురు విద్యార్థులు, కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 248 మందికి ఇద్దరు, కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎ సెంటర్‌లో 171కి నలుగురు, బి సెంటర్‌లో 170 మందికి ఒకరు, భాస్కరరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 134 మంది విద్యార్థులకు ఒక విద్యార్థి గైర్హాజరయ్యారన్నారు. మొత్తం 889 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 878 మంది హాజరయ్యారని తెలిపారు.

విజయవాడ వెళ్లి తలసేమియా బాలుడికి పింఛను

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల దుండగుడి దాడిలో తల్లి దండ్రులను కోల్పోయి తాను కూడా తీవ్ర గాయంతో చికిత్స పొందుతున్న తలసేమియా బాలుడికి 140 కిలోమీటర్లు ప్రయాణించి పింఛన్ అందించిన మహిళా వాలంటీర్ ఔదార్యాన్ని ఆ గ్రామస్తులు అభినందిస్తున్నారు. మండలంలోని మైసన్నగూడెంలో ఇటీవల అర్ధరాత్రి ఓ దుండగుడు చేసిన దాడిలో తల్లిదండ్రులను కోల్పోయిన 11 ఏళ్ల బాలుడు తోణం మంగారావు చిన్న వయస్సు నుంచి తలసేమియా వ్యాధితో బాధపడుతూ ప్రభుత్వం ద్వారా అందించే రూ.10 వేల పింఛనుతో చికిత్స పొందుతున్నాడు. దాడిలో గాయాలపాలైన బాలుడు విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం బాలుడి దీనస్థితిపై స్పందించిన మైసన్నగూడెం వాలంటీర్ కాంచనదేవి తన సొంత ఖర్చులతో విజయవాడ ఆసుపత్రికి వెళ్లి బంధువుల సమక్షంలో రూ.పది వేల పింఛన్ అందించి ఔదార్యం చూపారు. దీంతో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, మైసన్నగూడెం వాలంటీర్ కాంచన దేవిని అభినందించారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు



మహిళలకు చెక్కు అందిస్తున్న ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - పోలవరం

మహిళా సాధికారతే సిఎం జగన్ లక్ష్యమని ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం ఐకెపి కార్యాలయం ఆవరణలో మూడో విడత వైఎస్ఆర్ ఆసరా పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంఎల్‌ఎ మహిళా సంఘాల సభ్యులకు ఆసరా చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పోలవరం మండలంలో 943 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి 8999 మంది లబ్ధిదారులకు రూ.7.33 లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. మహిళా సాధికారతకు కృషి చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందన్నారు. గత ప్రభుత్వాలన్నీ కూడా మహిళలందరినీ ఒక ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాయన్నారు. మహిళల భద్రత, ఆరోగ్యం, మహిళా సాధికారత కోసం జగనన్న తప్ప ఏ ముఖ్యమంత్రి కూడా ఆలోచన చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్‌డిఎ పీడీ విజయరావు, ఎపిడి నాగేశ్వరరావు, ఎపిఎం శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి మీడియం సింగరాజు, శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ, ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్, ఎస్ఐ పవన్‌కుమార్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ముసునూరు

పేదల కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఎంఎల్‌శ్రీ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని లోపూడిలో గురువారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు, సర్పంచి పేరం కృష్ణ, వైసిపి గ్రామ నాయకులు బి.నరసింహారావు, మండల నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, సర్పంచులు రంగు ధనలక్ష్మి గాంధీ, చలసాని దామోదరరావు, శ్రీదేవి శ్రీనివాసరావు, ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, తహశీల్దార్ దాసరి సుధ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

దాళ్వా పంట పూర్తయి వరి కోతలు రెండు మూడు రోజుల్లో ప్రారంభం కానున్న దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉంగుటూరు మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం కోరింది. మండలంలోని గొల్లగూడెం రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచి శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ధాన్యం దిగుబడులకు సరిపడా గోనె సంచుల కొరత లేకుండా నిల్వ ఉంచాలని, రవాణా కోసం ఇబ్బందులు లేకుండా చేయాలని రైతులు కోరారు. మొన్న సార్వాలో ఎదురైన సమస్యలు పునావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్, ఏలూరు డిఆర్‌సి ఎడిఎ లలిత సుధ, నారాయణపురం సొసైటీ త్రిసభ్య కమిటీ డైరెక్టర్ దాసరి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

మక్కినవారిగూడెం కోలాట బృందానికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

తెలంగాణ రాష్ట్రం భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి గ్రామంలో లక్ష్మీ తిరుపతమ్మతల్లి అలయ కమిటీ వారు నిర్వహించిన కోలాటా భజన పోటీల్లో మండలంలోని మక్కినవారిగూడెం గ్రామంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ కోలాటా భజన బృందానికి ప్రథమ బహుమతి లభించిందని బృంద సభ్యులు తెలిపారు. 50కి పైగా కోలాటా బృందాలు పాల్గొనగా వాటిలో మక్కినవారిగూడెం వారు ప్రథమ బహుమతి గెలుపొందారని, కోలాట బృందం గురువులు అయిన భోగి రవి, వనమ ముత్యాలరావు తెలిపారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న బృంద సభ్యులను గ్రామ ప్రజలు అభినందించారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రతిరోజు వ్యాయామం చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల భవిత సెంటర్‌లో గురువారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు హెచ్.హన్నామణి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు, విద్యార్థులకు వీల్‌ఛైర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణరావు, జె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.